క్లుప్తంగా

అమ్మవారికి క్షీరాభిషేకం


కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రతీ ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్‌ల పర్యవేక్షణలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

కొర్లాంలో ముత్యాలమ్మ తీర్థం రేపు

గంట్యాడ: మండలంలోని కొర్లాం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి తీర్థం ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తీర్థం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఆరోజు ఉదయం 8 గంటలకు కబడ్డీ పోటీలు, మధ్యాహ్నం 3 గంటలకు ఎడ్ల పరుగు పందాల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నవోదయ మాక్ టెస్టు


ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తవలస: స్థానిక విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నవోదయ మాక్ టెస్టుకు మంచి స్పందన లభించింది. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 267 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని నిర్వాహకులు బగాది రమణ, పైడి ప్రసాద్ తెలిపారు. పరీక్షలో కొత్తవలస మండలానికి చెందిన కె.కుశ్వంత్‌కుమార్ 85 మార్కులతో ప్రథమ స్థానంలో, జోడిమెరకు చెందిన దీపక్ 84 మార్కులతో ద్వితీయ స్థానం , దత్తి గ్రామానికి చెందిన పి.జోహిత్ 83 మర్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఫైనల్

కుటుంబ ఆరోగ్య సర్వే ప్రారంభం


సర్వేలో పాల్గొన్న వైద్య బృందం

దత్తిరాజేరు: ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ పాపులేషన్ సర్వే సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రారంభించనట్టు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ఆదివారం సర్వే చేశారు. ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి అందజేయనున్నామని టీమ్ సూపర్ వైజర్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సత్యనారాయణ, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు,వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.10 వేల సహాయం


ఆశ్రమ నిర్వాహకుడికి నగదు అందజేస్తున్న ఉపసర్పంచ్ శ్రీదేవి, దాత తిరుమల

చీపురుపల్లి: పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, జిల్లా టెలీకాం బోర్డు సభ్యుడు ఇప్పిలి తిరుమల రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి చేతులు మీదుగా డబ్బులను ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు ఆశ్రమంలో ఆదివారం అందజేశారు. దాత తిరుమల మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నారాయణమ్మ, అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఆశ్రమంలో అన్నదానానికి ఆర్థిక సహకారం అందజేసినట్టు చెప్పారు. ఉపసర్పంచ్ శ్రీదేవి మాట్లాడుతూ వృద్ధాశ్రమం నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఒమ్మి రమేష్, కరణం ఆది, మహంతి లక్ష్మణ, సువ్వాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బంగారమ్మపేట గ్రామపెద్దలు


లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఇంటి ఆనందాన్ని నింపుతున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామంలో పూర్తిస్థాయిలో సీసీ కాలువలు లేవని స్థానికులు పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం ఆ పార్టీ సానుభూతి పరులకు, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చేవారికే అందించేవారని గుర్తు చేశారు. సీఎం జగన్ సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బంగారమ్మపేటకు ఏపీఐఆర్పీ నిధులు కోటి రూపాయలతో పాత భగ్గాం ప్రధాన రహదారి నుంచి గ్రామానికి కిలోమీటరు సీసీ రోడ్డు నిర్మించామని తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు రామమందిరం వద్ద ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచ్ బుగత సత్యనారాయణ, జెడ్పీటీసీ గార తవుడు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, బూడి వెంకటరావు, పల్లి సంజీవ్, సామంతుల పైడిరాజు, పాతబగ్గాం ఎంపీటీసీ అప్పయ్యమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాలంరాజుపేటలో...

మండలంలోని కాలంరాజుపేటలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కార్యక్రమంలో పాల్గొంటారని, మండల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

రూ.22 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష

చీపురుపల్లి: పట్టణంలోని జగన్నాథరాజు కాలనీలో రూ.22 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ఆదివారం భూమి పూజ చేశారు.

ఈసందర్భంగా వారు మాట్లాడు తూ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డు నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు, ఎంపీ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించినట్టు చెప్పారు. ఈ నిధులతో సీసీ రోడ్డుతో పాటు వీధి కాలువ నిర్మిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పతివాడ రాజారావు, గిరిడ రాందాసు, సూరు దుర్గారావు, కరణపు ఆది, కె.వెంకటేష్, ఒమ్మి రమేష్, ఎల్.ప్రభాత్ పాల్గొన్నారు.

కిరోసిన్ ఇంజిన్ చోరీ

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన రైతు నెక్కల ఈశ్వరరావు తన కిరోసిన్ ఇంజిన్ చోరీకి గురయ్యిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. రైతు తెలిపిన వివరాలు.. గ్రామంలోని కాంతమ్మ చెరువు నుంచి తన పశుగ్రాస క్షేత్రానికి నీరుపెట్టేందుకు గురువారం రాత్రి 10 గంటల వరకు ఇంజిన్‌తో నీటిని తోడించి, అక్కడే వదిలేసి ఇంటికి వచ్చేశారు. ఆదివారం మళ్లీ నీరు తోడడానికి వెళ్లగా చెరువు వద్ద ఇంజిన్ కనిపించపోవకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

నేడు 'స్పందన'

దత్తిరాజేరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 35 గ్రామాల ప్రజలు తమ సమస్యలపై స్పందనలో వినతులు అందించవచ్చని పేర్కొన్నారు. అన్నిశాఖల మండల అధికారులు, గ్రామ సచివాలయాల డీడీఓలు స్పందన కార్యక్రమానికి హాజరై వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ఉత్సాహంగా ఇంటింటికీ జగనన్న సైన్యం

'జగనన్నే మా భవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం గజపతినగరం, శృంగవరపుకోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఉత్సాహంగా కొనసాగుతోంది. గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల అమలు, పాలనపై సర్వే చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నీ అందుతున్నాయా లేదా, పథకాల కోసం ఎవరికైనా లంచాలు ఇవ్వాల్సి వచ్చిందా అని ప్రజలను ఆరా తీశారు. రూపాయి కూడా లంచం ఇవ్వకుండానే పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు బదులిచ్చారు. అనంతరం లబ్ధిదారుల అనుమతితో వారి ఇళ్లకు 'మానమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


బొండపల్లి: కొండకిండాంలో పథకాల అమలుపై సర్వే చేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు


వేపాడ: కుమ్మపల్లిలో ఇంటింట సర్వే నిర్వహిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ అరుణ


చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మెరకముడిదాం: సోమలింగాపురంలో పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీటీసీ సీతారామరాజు, గృహసారథులు


వేపాడ: వావిలపాడులో పథకాలను వివరిస్తున్న సర్పంచ్ రాజేశ్వరి, తదితరులు


గజపతినగరం రూరల్: ఎన్.జి.ఆర్.పురంలో పథకాల అమలుపై ఆరా తీస్తున్న సర్పంచ్ రామునాయుడు


గంట్యాడ: రామవరంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్, గృహసారథులు


గజపతినగరం: వెంకటాపురం ఎస్సీ కాలనీలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


దత్తిరాజేరు: చుక్కపేటలో గృహ సారథులతో కలిసి సర్వే చేస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ ఫణీంద్రుడు


బొండపల్లి:. రాచకిండాంలో పథకాలను వివరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

నెలివాడలో మెగా వైద్యశిబిరం


బొండపల్లి: రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది, నాయకులు


చీపురుపల్లి: శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో విశాఖపట్నానికి చెందిన అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ తాళ్లపూడి కీర్తి శిబిరాన్ని ప్రారంభించారు. నెలివాడతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన 200 మంది శిబిరానికి హాజరయ్యా రు. వీరికి వైద్యులు హరికిశోర్, శేఖర్, లలిత, గణేష్ తదితరులు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తాళ్లపూడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆంజనేయపురంలో...

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలోని సత్యసాయి కల్యాణ మండపం ఆవరణలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ సీహెచ్.ప్రవీణ్ శిబిరానికి వచ్చిన 173 మందికి బీపీ, సుగర్, బోన్స్ డెన్సిటీ తదితర వైద్య పరీక్షలు చేశారు. వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు, వై.నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం


చీపురుపల్లి: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష


శృంగవరపుకోట: పాటూరులో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న యువత , విద్యార్థులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆర్చ్ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ఆదివారం ప్రారంభించారు. రెండునెలల పాటు కొనసాగనున్న ఈ చలివేంద్రంలో తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ అమ్మవారి దేవస్థానానికి వచ్చే భక్తులతో పాటు దేవస్థానం ముందు ఉన్న రహదారిలో వెళ్లే ప్రయాణికుల కోసమే చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, దేవస్థానం ఈఓ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాటూరులో యువత ఆధ్వర్యంలో..

శృంగవరపుకోట: వేపాడ మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన యువత విశాఖ–అరకు రోడ్డును ఆనుకుని ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం కావడంతో గ్రామంలో పిల్లలు, యువత అంతా చలివేంద్రంలో ఉండి రోడ్డున వచ్చిపోయే వాహనాలను ఆపి, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. చలివేంద్రం నిర్వహణకు గ్రామ పెద్దలు సహకరించారు.

కమాండో గోవింద్ కుటుంబానికి పరామర్శ


గోవింద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అప్పారావు,రమణమూర్తి

చీపురుపల్లిరూరల్: విధి నిర్వహణలో మండలంలోని పర్ల గ్రామానికి చెందిన ఇండియన్ నేవీ మెరైన్ కమాండో గోవింద్ ఇటీవల మృతి చెందారు. పర్లలోని ఆయన కుటుంబాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపకుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి ఆదివారం పరామర్శించారు. గోవిం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోవింద్ కుటుంబానికి అండగా నిలవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

లక్కవరపుకోట/ కొత్తవలస: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అలాగే 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లభర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్టు లక్కవరపుకోట, కొత్తవలస కేజీబీవీల ప్రత్యేక అధికారులు బలిరెడ్డి ప్రవీణ, కొట్యాడ విజయలక్ష్మి ఆదివారం వేర్వేరు ప్రకటల్లోతెలిపారు. దరఖాస్తులను ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

అనాథలు, బడి బయట పిల్లలు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రోస్టర్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తామని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్‌ల ద్వారా మెసేజ్ అందజేస్తామని పేర్కొన్నారు.

మోడల్ సోక్ పిట్ ఏర్పాటు


ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోక్ పిట్ ఏర్పాటులో భాగంగా అమర్చిన పైపులు

బొండపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రయోగాత్మకంగా మోడల్ సోక్ పిట్‌ను ఎంపీడీఓ ఏ.వేదవతి ఏర్పాటు చేయించారు. మండల పరిషత్ సమావేశ మందిరం వద్ద ఈ సోక్ పిట్‌ను ఏర్పాటు చేసి, వర్షం నీరు నేరుగా పక్కనేఉన్న చేతి బోరులోకి ఇంకే విధంగా ఏర్పాట్లు చేశారు. వర్షం నీరు వృథాగా పోకుండా నేరుగా భూమిలోకి ఇంకేలాచర్యలు తీసుకున్నారు. భవనాలపై నుంచి వర్షం వృథాగా బయటకు పోకుండా, ఆ నీరు మెత్తం పైపులు ద్వారా నేరుగా చేతి బోరులోకి ఇంకేలా ఏర్పాట్లు చేశారు. ఈ విధానం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని ఎంపీడీఓ తెలిపారు.

లోకానికి వెలుగులు చూపిన రారాజు జీసస్


ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఏసు పునరుత్థాన ర్యాలీని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: లోకానికి వెలుగులు చూపిన రారాజు జీసస్ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఏసు సిలువ మరణం మానవాళి పాప విమోచనానికి దోహదపడిందని, పాపులను పునీతులను గావించేందుకు క్రీస్తు శిక్ష అనుభవించారన్నారు. ఏసు ప్రేమాలయం నిర్వాహకుడు పాస్టర్ అలజంగి రవికుమార్ నేతృత్వంలో ఆదివారం సాయంత్రం చేపట్టిన ర్యాలీని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగటల మాట్లాడుతూ, జీసస్ బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. పాస్టర్ అలజంగి రవికుమార్ మాట్లాడుతూ, క్రీస్తు బోధనల ప్రకారం ప్రతిఒక్కరూ శాంతి, సహనం పాటించాలన్నారు. కోట వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల మీదుగా తిరిగి కోటకు చేరుకుంది. క్రైస్తవ సోదరులు ఆలపించిన స్తుతిగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ చారుదాం, బిషప్ సుదర్శనరావు, అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.